epaper.telanganachowrasta.com
www.telanganachowrasta.com

# తెలంగాణ చౌరస్తా


తెలుగు దిన పత్రిక

సంపుటి: 02
సంచిక:31

24 క్యారెట్లు 155,300.00 | కిలో వెండి 2,50,000.00 | chourastha Digitals | 16.09.2026 బుధవారం, హైదరాబాద్

## 25 కిలోల వినాయకుడికి 108 బంగారు పుష్పాలతో పూజలు

- జగిత్యాల జిల్లాలో ఓ సంఘం ఆధ్వర్యంలో వెడితో తయారు
- ఆ గణేశుడికి 108 బంగారు పుష్పాలతో అభిషేకాలు
- గత 14 సంవత్సరాలుగా మట్టి వినాయకుడిని పూజిస్తున్నారు.




2లో

# యూపీఐ లావాదేవీలపై బాదుడు

## రూ.2వేలు దాటితే ఎండీఆర్ ఛార్జీలు

అక్టోబర్ 15 నుంచి అమల్లోకి
యూపీఐ పేమెంట్లపై కేంద్ర ఆర్థికశాఖ కీలక ప్రకటన
వ్యక్తుల మధ్య యూపీఐ లావాదేవీలన్నీ ఉచితమేనన్న కేంద్ర ఆర్థికశాఖ
వ్యక్తి వ్యాపారి మధ్య రూ.2 వేలు దాటితేనే ఎండీఆర్
చిన్న వ్యాపారులకు జీరో ఎండీఆర్

యూపీఐ చెల్లింపుల్లో కీలక మార్పులకు రంగం సిద్ధమైంది. రూ.2 వేలకు మించిన కొన్ని యూపీఐ లావాదేవీలపై మర్చంట్ డిస్కౌంట్ రేట్ (ఎండీఆర్) విధించేందుకు నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) కొత్త విధానాన్ని ప్రకటించింది. ఇకపై వ్యక్తులు రూ.2వేలకు మించి వ్యాపారులకు చేసే పేమెంట్స్‌పై 0.4 శాతం ఛార్జీ వర్తిస్తుందని స్పష్టంచేసింది.







2లో

# మోదీ మళ్లీ రాజీపడ్డారు

- అమెరికా ఒత్తిడికి లొంగిపోయారు
- యూపీఐ ఛార్జీలపై కాంగ్రెస్ ఫైర్
- కేంద్రంపై కాంగ్రెస్ తీవ్ర విమర్శలు
- రూ.2 వేల వరకు యూపీఐ లావాదేవీలకే ఫీజు మినహాయింపు ఎందుకని ప్రశ్న
- అమెరికా ఒత్తిడికి మోదీ తలొగ్గారు
- కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ

**తెలంగాణ చౌరస్తా, స్టేట్ బ్యూరో :** దేశవ్యాప్తంగా విస్తృతంగా వినియోగిస్తున్న యూపీఐ చెల్లింపులపై కేంద్రం తాజాగా జారీ చేసిన నోటిఫికేషన్‌పై కాంగ్రెస్ తీవ్ర విమర్శలు గుప్పించింది. ఈ లావాదేవీలపై చార్జీలు విధించేందుకు మార్గం సుగమం చేస్తోందంటూ లోక్‌సభ ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ।మిగతా 2 లో।



# తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌కు రండి



- సిటీ కాలేజ్, ఉస్మానియా ఆస్పత్రిని పునరుద్ధరించండి
- టూరిజం, ఎడ్యుకేషన్ రంగాల్లో సహకరించండి
- ప్రిన్స్ రహీమ్ ఆగా ఖాన్-5కు ముఖ్యమంత్రి ఆహ్వానం
- తాజ్ ఫలక్ నుమా ప్యాలెస్ లో ప్రిన్స్ తో
- సీఎం రేవంత్ రెడ్డి భేటీప్రభుత్వ సేవలు పొందండి
- మూసీ పునరుజ్జీవంపై ప్రత్యేక దృష్టి 2లో
- 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ ఎకానమీ లక్ష్యం

# 40 ఎకరాల భూమి శాంతా శ్రీరామ్ సంస్థదే


- సుప్రీంకోర్టులో రాష్ట్ర ప్రభుత్వానికి చుక్కెదురు
- శాంతా శ్రీరామ్ కన్‌స్ట్రక్షన్స్, తెలంగాణ ప్రభుత్వం మధ్యలో వివాదం
- ఆ భూమిపై దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టేసింది
- ఈ భూమి వ్యవహారంలోనే హైడ్రా కమిషనర్ రంగనాథ్‌పై కోర్టు ధిక్కరణ కేసు 2లో
- లోతుకుంట భూములపై సర్వే పూర్తయ్యాక వాస్తవాలు తెలుస్తాయి
- హైడ్రా కమిషనర్ రంగనాథ్



# 30% శాతం కమీషన్ల ప్రయత్నాలను మానుకోవాలి



- ప్రజల ఆస్తులను నిషేధిత జాబితాలో పెట్టి దోపిడీకి తెర
- 22ఏ అక్రమాల పైన్యాయ విచారణ జరపాలి
- కాలనీలు, అపార్ట్‌మెంట్లు, ఇండ్లను బేషరతుగా తొలగించాలనే ప్రయత్నాలను మానుకోవాలి 2లో
- బాధితులకు ప్రభుత్వం క్షమాపణ చెప్పాలి
- ధరణి వ్యవస్థ ప్రజల ఆస్తులకు రక్షణ కవచంలా ఉండేది
- యజమాని వేలిముద్ర లేకుండా ఆస్తి బదిలీ చేయడం అసాధ్యం
- ఇది భూభారతి కాదు...భూహారతి
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



# యూపీఐ లావాదేవీలపై బాదుడు

**తెలంగాణ చౌరస్తా, స్టేట్ బ్యూరో :**

యూపీఐ చెల్లింపుల్లో కీలక మార్పులకు రంగం సిద్ధమైంది. రూ.2 వేలకు మించిన కొన్ని యూపీఐ లావాదేవీలపై మర్చంట్ డిస్కౌంట్ రేట్ (ఎండీఆర్) విధించేందుకు నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) కొత్త విధానాన్ని ప్రకటించింది. ఇకపై వ్యక్తులు రూ.2వేలకు మించి వ్యాపారులకు చేసే పేమెంట్స్‌పై 0.4 శాతం ఛార్జీ వర్తిస్తుందని స్పష్టంచేసింది. ఈ మార్పులు అక్టోబర్ 15 నుంచి అమల్లోకి రానున్నాయి. అయితే వ్యక్తుల మధ్య జరిగే లావాదేవీలపై ఈ ఛార్జీ భారం పడదు. వారు యూపీఐ ద్వారా చెల్లింపులు చేయడం గతంలో మాదిరిగానే ఉచితంగానే కొనసాగుతుంది. వ్యక్తుల మధ్య జరిగే నగదు లావాదేవీలు (P2P), రూ.2000లోపు వ్యాపార చెల్లింపులు (P2M) ఎండీఆర్ పరిధిలోకి రావని స్పష్టంచేసింది.కొత్త విధానం ప్రకారం, వ్యక్తి వ్యాపారుల (P2M) కేటగిరీలో రూ.2 వేలకు మించిన యూపీఐ లావాదేవీలపై 0.4 శాతం ఎండీఆర్ వర్తిస్తుంది. ఒక్కో లావాదేవీకి ఈ ఛార్జీ గరిష్ఠంగా రూ.300కు పరిమితం చేస్తారు. ఉదాహరణకు రూ.2,000కు 0.4 శాతం అంటే రూ.8 అవుతుంది. అయితే ఇది వ్యాపారి వైపు వర్తించే ఎండీఆర్ మాత్రమేనని ఎన్‌పీసీఐ స్పష్టం చేసింది. రూ.2,000 వరకు జరిగే P2M లావాదేవీలపై ఎండీఆర్ విధించరు. అలాగే, వ్యక్తుల మధ్య జరిగే నగదు లావాదేవీలు (P2P) కూడా ఈ కొత్త ఎండీఆర్ పరిధిలోకి రావు. ప్రస్తుతం UPI ద్వారా జరిగే P2M లావాదేవీల్లో 95 శాతానికి పైగా రూ.2,000లోపే ఉన్నందున, ఈ లావాదేవీలపై కొత్త విధానం ప్రభావం ఉండదని ఎన్‌పీసీఐ తెలిపింది. అయితే చిన్న వ్యాపారులకు కూడా ఊరట కల్పించింది ఎన్‌పీసీఐ. పర్సన్‌టుపర్సన్ మర్చంట్ (P2PM) కేటగిరీలో ఉన్న చిన్న వ్యాపారులకు జీరో ఎండీఆర్ సౌకర్యం కొనసాగుతుంది. యూపీఐ క్యూఆర్ ద్వారా నేరుగా బ్యాంకు ఖాతాలో నెలకు రూ.1 లక్ష వరకు చెల్లింపులు స్వీకరించే చిన్న విక్రేతలు ఈ కేటగిరీలోకి వస్తారు. కొన్ని నిర్దిష్ట వ్యాపార విభాగాలకు మాత్రం శాతం ఆధారంగా కాకుండా ఫ్లాట్ ఎండీఆర్ విధిస్తారు. రైల్వే, టెలికాం సేవలు, బీమా, ఇంధనం వంటి కేటగిరీల్లో రూ.2,000కు మించిన UPI చెల్లింపులపై ఒక్కో లావాదేవీకి రూ.5 ఎండీఆర్ వర్తిస్తుంది.

**చిన్న వ్యాపారాలకు ప్రత్యేక నిధి**

డిజిటల్ చెల్లింపుల మౌలిక సదుపాయాలను మరింత విస్తరించేందుకు ప్రత్యేక నిధిని ఏర్పాటు చేయాలని కొత్త ఫ్రేమ్‌వర్క్‌లో ప్రతిపాదించారు. ఇప్పటికే యూపీఐని ఉపయోగిస్తున్న చిన్న వ్యాపారులతో పాటు టైర్3, అంతకంటే చిన్న మార్కెట్లలోని వ్యాపారులను డిజిటల్ చెల్లింపుల వ్యవస్థలోకి తీసుకురావడమే దీని ఉద్దేశం. అధిక విలువ కలిగిన లావాదేవీలపై వసూలయ్యే ఎండీఆర్‌ను యూపీఐ ఎకోసిస్టమ్‌లోని వివిధ భాగస్వాములకు పంపిణీ చేస్తారు. కొత్త వినియోగదారులు, వ్యాపారులను యూపీఐ పరిధిలోకి తీసుకురావడం, సైబర్ భద్రత, వ్యవస్థ సామర్థ్యం, సాంకేతిక ఆవిష్కరణలపై పెట్టుబడులకు ఈ నిధులు ఉపయోగపడతాయని ఎన్‌పీసీఐ పేర్కొంది. 2020 నుంచి సున్నా శాతం ఛార్జీలు ఉండటం వల్ల ఆర్థికంగా భారం పడుతోందని బ్యాంకులు, ఫిన్‌టెక్ సంస్థలు సుదీర్ఘకాలంగా విజ్ఞప్తి చేస్తున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఎండీఆర్ ద్వారా వచ్చే ఆదాయంలో ఐదో శాతాన్ని యూపీఐ వ్యవస్థను మరింత విస్తరించడానికి ఉపయోగిస్తామని ఎన్‌పీసీఐ తెలిపింది. క్రెడిట్ కార్డులు, డెబిట్ కార్డులు, వ్యాలెట్ ఛార్జీలతో పోలిస్తే ఈ ఎండీఆర్ రుసుములు చాలా తక్కువని పేర్కొంది. యూపీఐ యాప్‌లు ప్లాట్‌ఫామ్ ఫీజులు విధించకుండా నిషేధం విధించింది. ప్రస్తుతం బ్రెజిల్‌లో 0.33 శాతం, చైనాలో 0.40 శాతం ఎండీఆర్ అమలవుతోంది.

# మోదీ మళ్లీ రాజీపడ్డారు

**తరువాయి భాగం**

విమర్శించారు. రూ.2 వేలకుపైబడిన వ్యాపారి యూపీఐ లావాదేవీలపై మర్చంట్ డిస్కౌంట్ రేట్ (ఎండీఆర్) విధించే అవకాశం కల్పించడం ద్వారా జీరోచార్జీ విధానాన్ని నీరుగార్చే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. ఈ వ్యవహారాన్ని అమెరికా చెల్లింపు సంస్థల ఒత్తిడితో ముడిపెట్టిన ఆయన, ప్రధాని నరేంద్ర మోదీ మరోసారి అమెరికా ఒత్తిడికి లొంగిపోయారని ఆరోపించారు. ఈ మేరకు ఎక్స్‌లో పోస్ట్ చేశారు.'యూపీఐ లావాదేవీలపై ఫీజులు విధించేందుకు ప్రభుత్వం నిశ్శబ్దంగా మార్గం సుగమం చేస్తోంది. రూ.2 వేలకుపైబడిన వ్యాపార సంబంధిత యూపీఐ లావాదేవీలపై భవిష్యత్తులో ఎండీఆర్ విధించే అవకాశం ఉంది. యూపీఐ లావాదేవీల పరిమాణంలో రూ.2వేలకు పైబడిన చెల్లింపులు కేవలం ఐదు మాత్రమే ఉన్నాయి. అయితే విలువ పరంగా చూస్తే ఇవే దాదాపు 65 శాతం వరకు ఉంటాయి. వినియోగదారుల నుండి ఎలాంటి ఫీజులు వసూలు చేయబోమని ప్రభుత్వం చెబుతోంది. కానీ కష్టమర్ల నుంచి నేరుగా ఎలాంటి యూపీఐ ఫీజు వసూలు చేయబోమని ప్రభుత్వం చెబుతోంది. అయితే దుకాణదారులపై విధించే చార్జీలను ఎవరు భరిస్తారు? అవి వస్తువుల ధరల్లోకి చేరి చివరకు వినియోగదారుల జేబు నుంచే బయటకు వస్తాయి' అని రాహుల్ గాంధీ అన్నారు.



**అమెరికా కంపెనీల ఒత్తిడే కారణమా?**

భారత్‌లో ప్రస్తుతం అమల్లో ఉన్న జీరో ఎండీఆర్ విధానంపై అమెరికాకు చెందిన చెల్లింపు సంస్థలు చాలాకాలంగా అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నాయని రాహుల్ గాంధీ ఆరోపించారు. యూపీఐ ద్వారా చెల్లింపులు జరిగినప్పుడు వ్యాపారుల నుంచి ఎండీఆర్ వసూలు చేయకపోవడం వల్ల చెల్లింపు సంస్థలకు ఆదాయ అవకాశాలు పరిమితమవుతున్నాయన్న వాదనలున్నాయని ఆయన పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో తాజాగా తీసుకున్న చర్యలు, గతంలో అమెరికాతో వాణిజ్య ఒప్పందం విషయంలో కేంద్ర ప్రభుత్వం వ్యవహరించిన తీరును గుర్తు చేస్తున్నాయని రాహుల్ అన్నారు. అమెరికా ఒత్తిడికి ప్రధాని మోదీ మరోసారి లొంగిపోయారని వ్యాఖ్యలు చేశారు.

# తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌కు రండి

**తెలంగాణ చౌరస్తా, స్టేట్ బ్యూరో :**

భారత్ ఫ్యూచర్ సిటీలో డిసెంబర్ 7 నుంచి మూడు రోజుల పాటు నిర్వహించనున్న తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌కు హాజరు కావాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రిన్స్ రహీమ్ ఆగా ఖాన్5ను కోరారు. తెలంగాణలోని విద్యా, పర్యాటక, వైద్య రంగాల్లో కలిసి పని చేద్దామని ఆయన విజ్ఞప్తి చేశారు. తాజ్ ఫలక్‌నుమా ప్యాలెస్‌లో ప్రిన్స్ రహీమ్ ఆగా ఖాన్5తో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంగళవారం మర్యాదపూర్వకంగా సమావేశమయ్యారు. మంత్రి అజహరుద్దీన్, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, సీఎం సలహాదారు రామకృష్ణారావుతో పాటు పలువురు ప్రభుత్వ ఉన్నతాధికారులు, అగా ఖాన్ ఫౌండేషన్ అధికారులు సమావేశంలో పాల్గొన్నారు. ప్రిన్స్ రహీమ్ ఆగా ఖాన్5 తండ్రి, దివంగత ఆగా ఖాన్4 మరణం పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంతాపం తెలిపారు. హైదరాబాద్‌తో ఆగా ఖాన్ కుటుంబానికి ఉన్న అనుబంధాన్ని ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. ఆగా ఖాన్ ఫౌండేషన్‌పై తమకు అత్యంత గౌరవం ఉందని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. తెలంగాణలో ఫౌండేషన్ తరపున చేపడుతున్న కార్యక్రమాలను ఆయన కొనియాడారు. తెలంగాణ వారసత్వ సంపదను పునరుద్ధరించడంలో ఆగా ఖాన్ ఫౌండేషన్ కీలక పాత్ర పోషిస్తోందన్నారు. ఫౌండేషన్ సహకారంతో శాసనమండలి భవనాన్ని పునరుద్ధరించుకుని ఇటీవలే ప్రారంభించుకున్న విషయాన్ని ప్రిన్స్ రహీమ్ ఆగా ఖాన్5కు సీఎం గుర్తుచేశారు. ఆగా ఖాన్ ఫౌండేషన్ సహకారంతో పునరుద్ధరించిన కుతుబ్ షాహీ టూంబ్స్ ప్రారంభోత్సవంలో తాము కలిసిన విషయాన్ని కూడా ఈ సందర్భంగా సీఎం ప్రస్తావించారు.

**ఫ్యూచర్ సిటీపై ప్రిన్స్ రహీమ్ ఆగా ఖాన్-5 ఆసక్తి**

30వేల ఎకరాల్లో భారత్ ఫ్యూచర్ సిటీని నిర్మిస్తున్నట్టు



ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. ఫ్యూచర్ సిటీపై ప్రిన్స్ రహీమ్ అగా ఖాన్5 ఆసక్తికనబరిచారు. ఫ్యూచర్ సిటీని ఎక్కడ నిర్మిస్తున్నారని సీఎం రేవంత్‌రెడ్డిని ఆయన ప్రత్యేకంగా అడిగి తెలుసుకున్నారు. శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు సమీపంలో ఫ్యూచర్ సిటీని ఏర్పాటు చేస్తున్నామని ముఖ్యమంత్రి తెలిపారు. ఇందుకోసం సింగపూర్ కంపెనీ మాస్టర్‌ప్లాన్ రూపొందిస్తోందని వివరించారు. ఫ్యూచర్ సిటీని నెట్‌జీరో సిటీగా ఏర్పాటు చేస్తామని, దాదాపు 15వేల ఎకరాల్లో గ్రీన్‌జోన్ ఉంటుందని ప్రిన్స్ రహీమ్ ఆగా ఖాన్5కు తెలిపారు. ఇప్పటికే అమెజాన్ వంటి ప్రముఖ సంస్థలు ఫ్యూచర్ సిటీలో తమ కార్యకలాపాలను ప్రారంభించాయని సీఎం వెల్లడించారు.

**విద్యా, పర్యాటక రంగాల్లో సహకారంపై చర్చ**

ఇటీవల బ్రిటన్, అమెరికా పర్యటనల్లో వివిధ ప్రపంచస్థాయి యూనివర్సిటీలతో తెలంగాణ ప్రభుత్వం చేసుకున్న ఒప్పందాల గురించి సీఎం సలహాదారు రామకృష్ణారావు ప్రిన్స్ రహీమ్ ఆగా ఖాన్5కు వివరించారు. హార్వర్డ్ యూనివర్సిటీ, లండన్ స్కూల్ ఆఫ్ బిజినెస్‌తో పాటు ఇతర యూనివర్సిటీలు హైదరాబాద్‌లో తమ కార్యకలాపాలు ప్రారంభించడానికి అంగీకరించాయని ఆయన తెలిపారు. మరోవైపు, ఫ్యూచర్ సిటీలో ఆగా ఖాన్ యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని రాష్ట్ర విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ యోగితా రాణా కోరారు. పర్యాటక రంగంలో ఆగా ఖాన్ ఫౌండేషన్ పాత్రను స్పెషల్ చీఫ్ సెక్రటరీ వాణీ ప్రసాద్ గుర్తు చేశారు. భవిష్యత్తులో మరింత సహకారం అందించాలని ఆమె కోరారు.

# 30 శాతం కమీషన్ల ప్రయత్నాలను మానుకోవాలి

**తెలంగాణ చౌరస్తా, స్టేట్ బ్యూరో**

హైదరాబాద్ 22ఏ కింద లక్షల ఎకరాలను నిషేధిత జాబితాలో చేర్చి ప్రజలను రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె తారక రామారావు (కేటీఆర్) విమర్శించారు. ప్రజల ఆస్తులను నిషేధిత జాబితాలో పెట్టి దోపిడీకి పాల్పడుతున్నారనీ, 30 శాతం కమీషన్ల కోసం చేస్తున్న ఈ ప్రయత్నాలను ప్రభుత్వం వెంటనే నిలిపేయాలని డిమాండ్ చేశారు. 22ఏ అక్రమాలపై న్యాయ విచారణ జరపాలని కోరారు. మంగళవారం ఢిల్లీలో పలు కార్యక్రమాల్లో పాల్గొనేందుకు వెళ్లిన కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. 22ఏ అంశంపై అసెంబ్లీలో ప్రభుత్వం సరైన సమాధానం ఇస్తుందని ఆశించామనీ, రెవెన్యూ మంత్రి కేవలం 'సారీ'తో సరిపెట్టారని అన్నారు. "తప్పు చేసింది అధికారులు కాదనీ ప్రభుత్వమేనని విమర్శించారు. ప్రజల సమస్యలను పరిష్కరించకుండా అధికారులపై నెపం నెట్టడం సరికాదన్నారు. ప్రజలు కష్టార్జితంతో కొనుగోలు చేసిన కాలనీలు, అపార్ట్‌మెంట్లు, ఇండ్లను నిషేధిత జాబితాలో చేర్చినట్లయితే వాటిని బేషరతుగా తొలగించి, బాధితులకు ప్రభుత్వం క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.ధరణి రక్షణ కవచం ధరణి వ్యవస్థ ప్రజల ఆస్తులకు రక్షణ కవచంలా ఉండేదని కేటీఆర్ అన్నారు. యజమాని వేలిముద్ర లేకుండా ఆస్తి బదిలీ చేయడం సాధ్యం కాని విధంగా భద్రత ఉండేదన్నారు.ప్రస్తుతం యజమానులకు తెలియకుండానే రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయనీ, ఆస్తులు నిషేధిత జాబితాలోకి వెళ్తున్నాయని ఆరోపించారు. ఇది భూభారతి కాదనీ, భూ హారతి అని విమర్శించారు. అన్ని అడ్డగోలు చర్యలను నిలిపేసి, ప్రజల యాజమాన్య హక్కులకు రక్షణ కల్పించేలా యథాతథ పరిస్థితిని పునరుద్ధరించాలని కోరారు.అసైన్డ్ భూములపై హామీ నిలబెట్టుకోవాలిఅసైన్డ్ భూముల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీని ఇప్పుడు అమలు చేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. ఎస్సీ, ఎస్టీలకు చెందిన అసైన్డ్ భూములను రెగ్యులరైజ్ చేసి, వారికి యాజమాన్య హక్కులు కల్పించాలని అన్నారు. అసైన్డ్ భూములకు పట్టాలిచ్చే పేరుతో ముందుగానే ఒప్పందాలు జరుగుతున్నాయన్న అనుమానాలు ఉన్నాయని ఆరోపించారు. ప్రభుత్వం తీసుకునే ప్రతి పథకం వెనుక అక్రమాలు ఉన్నాయని చెప్పారు. రెండేండ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం వస్తుందనీ, తప్పు చేసిన వారిని వదిలి పెట్టబోమని హెచ్చరించారు.ప్రధాన ప్రతిపక్షాన్ని సభ నుంచి బయటకు పంపారుప్రజాస్వామ్యంలో ప్రధాన ప్రతిపక్షంగా నిరసన తెలిపే హక్కు తమకుందని కేటీఆర్ అన్నారు. బీఆర్ఎస్ సభ్యులు అనని మాటలను అంటగట్టి, సభ నుంచి బయటకు పంపారని ఆరోపించారు. ప్రభుత్వం సమాధానం చెప్పాల్సిన అంశాల నుంచి తప్పించుకునేందుకే తమను సస్పెండ్ చేసిందన్నారు.

సస్పెండ్ చేసినప్పటికీ తాము ప్రజల్లోనే ఉన్నామని చెప్పారు. ప్రజా సమస్యలను ఎత్తిచూపుతూనే ఉంటామన్నారు.తప్పు చేసింది ప్రభుత్వం శిక్ష అనుభవిస్తున్నది ప్రజలు అని వ్యాఖ్యానించారు. నిషేధిత జాబితాలో ఆస్తులను చేర్చడం ద్వారా ప్రజల యాజమాన్య హక్కులను దెబ్బతీస్తున్నారని ఆరోపించారు. ఇవాళ తప్పించుకున్నా రేపు తప్పించుకోలేరని హెచ్చరించారు.పోలీసులపై నమ్మకం లేదు.. న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తాంప్రతిపక్ష నేత కేసీఆర్ ఇంటిపై దాడి ఘటనను ప్రస్తావిస్తూ కేటీఆర్ తీవ్ర ఆరోపణలు చేశారు. తమ సిబ్బందిని పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి అక్కడే కాంగ్రెస్ కార్యకర్తలు దాడి చేసే పరిస్థితి ఏర్పడిందన్నారు. పోలీసులు కాంగ్రెస్ కార్యకర్తల కంటే హీనంగా పనిచేస్తున్నారని విమర్శించారు.

# 40 ఎకరాల భూమి శాంతా శ్రీరామ్ సంస్థదే

**తెలంగాణ చౌరస్తా, స్టేట్ బ్యూరో :**

శాంతా శ్రీరామ్ కన్‌స్ట్రక్షన్స్ వ్యవహారంలో రాష్ట్ర ప్రభుత్వానికి చుక్కెదురైంది. హైదరాబాద్‌లోని 40 ఎకరాల భూమి శాంతా శ్రీరామ్ సంస్థకే చెందుతుందని సుప్రీంకోర్టు తేల్చి చెప్పింది. శాంతా శ్రీరామ్ కన్‌స్ట్రక్షన్స్‌కు వ్యతిరేకంగా తెలంగాణ దాఖలు చేసిన పిటిషన్‌ను ఈ మేరకు సుప్రీంకోర్టు కొట్టేసింది. హైకోర్టు తీర్పును సకాలంలో సవాలు చేయలేదన్న సుప్రీంకోర్టు తగిన సమయంలో దాఖలు చేయకపోవడంతో విచారణకు తీసుకోలేమని స్పష్టం చేసింది. దీంతో జస్టిస్ దీపాంకర్ దత్తా ధర్మాసనం పిటిషన్‌ను డిస్మిస్ చేసింది. సికింద్రాబాద్ ప్రాంతంలో వివాదాస్పద భూమి ప్రైవేటు(శాంతా శ్రీరామ్ కన్‌స్ట్రక్షన్స్) వారికి చెందినదే అని చెప్పింది. రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌లో శాంతా శ్రీరామ్ కన్‌స్ట్రక్షన్స్ కేవియట్ దాఖలు చేసింది. ఈ భూమి వ్యవహారంలోనే హైడ్రా కమిషనర్ రంగనాథ్‌పై కోర్టు ధిక్కరణ కేసు నమోదైన సంగతి తెలిసిందే.లోతుకుంటలో 40 ఎకరాల భూవివాదంలో రాష్ట్ర ప్రభుత్వ పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసిన నేపథ్యంలో హైడ్రా కమిషనర్ రంగనాథ్ స్పందించారు. కాలపరిమితి ముగియడంతో సాంకేతిక కారణాలతో సుప్రీంకోర్టు ఆ పిటిషన్‌ను కొట్టివేసిందని పేర్కొన్న రంగనాథ్ సుప్రీంకోర్టు ఆదేశాలతో అన్ని భాగస్వామ్య వర్గాలు, రాష్ట్ర ప్రభుత్వంతో చర్చించి తదుపరి చర్యలపై నిర్ణయం తీసుకుంటామని



తెలిపారు. అలాగే జనరల్ ల్యాండ్ రిజిస్టర్ 243లో పేర్కొన్న 119 ఎకరాల భూములపై సమగ్ర సర్వే నిర్వహించాలని, సర్వే ద్వారా లోతుకుంట భూమి హద్దులు, వాస్తవ పరిస్థితులు స్పష్టంగా బయడపడతాయన్నారు. అలాగే లోతుకుంటలోని సర్వే నంబరు 1, 2లోని శాంతాశ్రీరాం బిల్డర్స్ లే ఔట్‌కు ప్రస్తుతం హైడ్రా కాపాడిన ప్రభుత్వ భూమికి మధ్య దూరం దాదాపు 3 కిలోమీటర్ల వరకూ ఉందని హైడ్రా హైకోర్టుకు విన్నవించింది. సర్వే నంబర్ 1, 2కు సంబంధించి ప్రైవేట్ భూమిపై ఉన్న కోర్టు ఉత్తర్వులకు జీఎల్ఆర్ నంబర్ 243, 255కు ఎలాంటి సంబంధం లేదని హైడ్రా వాదించింది. ఈ వివాదంపై ఇటు ప్రభుత్వం, అటు నిర్మాణ సంస్థ ఉన్నత న్యాయస్థానాలను ఆశ్రయించడంతో విచారణ జరిపిన సుప్రీంకోర్టు సాంకేతిక కారణాలతో ప్రభుత్వ పిటిషన్‌ను కొట్టివేసింది.

- పచ్చని కుటుంబంలో నిండిన శోకం
- భద్రతా ప్రమాణాలు లేక రాలిన ప్రాణం
- అధికారుల ఉదాసీనతకు పెయింటింగ్ కార్మికుడు బలి
- విద్యానగర్‌లో భవనం పైనుంచి పడి గుంపెన వాసి మృతి!
- పెళ్లైన ఆరు నెలలకే ఆరిపోయిన దీపం
- అక్క ఇంట్లో ఉంటూ పనికెళ్తే శవమై వచ్చాడు!

# ప్రభుత్వ యంత్రాంగం నిర్లక్ష్యానికి మరొక బలి

## అక్రమ జీ+2 భవనం పైనుంచి జారిపడి పెయింటింగ్ కార్మికుడు మృతి!





**భద్రాద్రి కొత్తగూడెం బ్యూరో**
**తెలంగాణ చౌరస్తా :**

అన్నపురెడ్డిపల్లి మండలం గుంపెనకు చెందిన పెనమల సతీష్ అనే యువకుడికి ఆరు నెలల కిందటే వివాహమైంది. బతుకుదెరువు కోసం భార్యతో కలిసి కొత్తగూడెం హెడ్ ఆఫీస్ సమీపంలోని అక్కాబావల ఇంటి వద్ద ఉంటూ పెయింటింగ్ పనులు చేసుకుంటున్నాడు. మంగళవారం విద్యానగర్ కాలనీలోని రాయల్ బిల్డింగ్ పక్కన సాగుతున్న ఒక భవనంలో పెయింటింగ్ వేస్తూ, తాడు తెగి జారిపడటంతో అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. నూరేళ్ల పంట పండాల్సిన ఆ యువకుడి జీవితం ఆరు నెలలకే ముగిసిపోవడంతో ఆ కుటుంబం కంటికి మింటికి ఏకధారగా విలపిస్తోంది.

**అనుమతులు లేని జీ+3 నిర్లక్ష్యం భద్రత గాలికి.. తాడు తెగి నేలకూలిన ప్రాణం!**

ప్రమాదం జరిగిన కట్టడం సాధారణమైనది కాదు.. విద్యానగర్ కాలనీ ప్రధాన రహదారి పక్కన నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్న అక్రమ జీ+3 భవనం! కార్మికులకు కనీస సేఫ్టీ బెల్టులు, నెట్లు, భద్రతా ఉపకరణాలు కల్పించకుండా నిర్లక్ష్యంగా పనులు చేయిస్తున్నారు. సరైన భద్రతా ప్రమాణాలు పాటించకపోవడం, కేవలం ఒక తాడుపై ఆధారపడి అంత ఎత్తులో పని చేయించడంతోనే ఈ ప్రమాదం జరిగింది. నిర్మాణదారుడి ధనాశ, అధికారుల అండదండలే సతీష్ ప్రాణాలను బలిగొన్నాయని స్థానికులు మండిపడుతున్నారు.

*ముందే హెచ్చరించినా పెడచెవిన పెట్టిన అధికారులు ఇది ప్రమాదం కాదు, 'ప్రభుత్వ హత్యే'!*

విద్యానగర్ పరిధిలో ఏజెన్సీ చట్టాలను, నిర్మాణ నిబంధనలను బేఖాతరు చేస్తూ అక్రమ జీ+3 భవనాలు వెలుస్తున్నాయని 'తెలంగాణ చౌరస్తా ' దినపత్రిక ముందే పక్కా ఆధారాలతో హెచ్చరించింది. అక్రమ నిర్మాణాలు, కార్మికుల భద్రతపై కథనాలు ప్రచురించినా అధికారులు నిద్రమత్తు వదల్లేదు. పత్రికల్లో వార్తలు వచ్చినా స్పందించి నిర్మాణాలను నిలిపివేసి ఉంటే ఈ రోజు సతీష్ ప్రాణాలు పోయేవి కావు. అధికారుల ఈ క్రిమినల్ నిర్లక్ష్యం కేవలం ఉదాసీనత కాదని, ముమ్మాటికీ యంత్రాంగం చేసిన "హత్యే" అని ప్రజలు ధ్వజమెత్తుతున్నారు.


09/09/2026 | Page No: 4
epaper.telanganachowrasta.com
తెలంగాణ చౌరస్తా
Voice Of Democracy
ఏజెన్సీలో 'మాఫియా' పంజా
- చుంచుపల్లి పోలీస్ స్టేషన్ వెళ్లే దారిలో భారీ నిర్మాణాలు
- ప్రధాన రహదారి పక్కనే బహుళ అంతస్తులు.. అధికారుల కళ్లకు కనిపించవా?
- రాజకీయ అండతో అక్రమ సామ్రాజ్యం.. నిబంధనలకు బహిరంగ సవాల్!
- భారీ సెల్లార్ తవ్వకంతో పక్కనున్న ఇళ్లకు ముప్పు.. ప్రజల్లో తీవ్ర భయాందోళనలు
- 'పెటిషన్ వస్తేనే చూస్తాం' అంటున్న డీపీవో..
- కలెక్టర్ తక్షణమే జోక్యం చేసుకోవాలని డిమాండ్

epaper.telanganachowrasta.com


30/05/2026 | Page No: 3
epaper.telanganachowrasta.com
తెలంగాణ చౌరస్తా
విద్యానగర్‌లో అక్రమ నిర్మాణాల జోరు

**ఏజెన్సీ చట్టాల ఉల్లంఘన కళ్లముందే అక్రమ కట్టడాలు.. చేతులు మారిన ముడుపులు?***

సామాన్యులు చిన్న ఇల్లు కట్టుకుంటే నిబంధనల పేరుతో వేధించే అధికారులు, జాతీయ రహదారి పక్కనే రాయల్ బిల్డింగ్ సమీపంలో అక్రమంగా జీ+3 భవనం వెలుస్తుంటే ఎందుకు మౌనంగా ఉన్నారు? కనీసం నోటీసులు ఇవ్వకపోవడం, తనిఖీలు చేయకపోవడం వెనుక భారీగా ముడుపులు చేతులు మారాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అధికారుల అవినీతి దాహానికి ఒక పేద కార్మికుడి రక్తంతో మూల్యం చెల్లించుకోవాల్సి వచ్చిందని స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**బాధ్యులపై క్రిమినల్ కేసులు పెట్టాలి కలెక్టర్ గారూ.. తక్షణమే స్పందించండి!**

ఈ ఘోర ఘటనపై జిల్లా కలెక్టర్ తక్షణమే సమగ్ర విచారణకు ఆదేశించాలని విద్యానగర్ వాసులు డిమాండ్ చేస్తున్నారు. క్రిమినల్ కేసులు కార్మికుడి భద్రతను గాలికి వదిలేసిన నిర్మాణదారుడితో పాటు, ఫిర్యాదులు ఉన్నా స్పందించని సంబంధిత అధికారులపై తక్షణమే ఐపీసీ సెక్షన్ల కింద క్రిమినల్ కేసులు నమోదు చేయాలి.భారీ నష్టపరిహారం ఆరు నెలల కిందటే పెళ్లై తీవ్ర శోకంలో ఉన్న సతీష్ భార్యకు, కుటుంబానికి నిర్మాణదారుడు ప్రభుత్వ పరంగా కోటి రూపాయల నష్టపరిహారం అందించి ఆదుకోవాలి.కూల్చివేత చర్యలు విద్యానగర్‌లోని రాయల్ బిల్డింగ్ పక్కన ఉన్న ఈ అక్రమ జీ+3 భవనంతో పాటు నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన అన్ని కట్టడాలను తక్షణమే కూల్చివేయాలి.

# అక్రమ ఆయుధంతో డి–కంపెనీ మాజీ అనుచరుడు అలీ డాన్ అరెస్ట్

- ఒక పిస్టల్ ఆరు బుల్లెట్లు స్వాధీనం
- పరారీలో మరో నిందితుడు
- గోల్కొండ జోన్ టాస్క్ ఫోర్స్ గుడిమల్కాపూర్ పోలీసుల సంయుక్త ఆపరేషన్






**ఎల్ బి.నగర్,తెలంగాణ చౌరస్తా:** రాజధానిలో మళ్లీ అక్రమ ఆయుధాల దందా తోపాటు బెదిరింపులకు పాల్పడుతున్న ముఠాను గోల్కొండ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్ట్ చేశారు.అక్రమంగా దేశీ పిస్టల్ తో పాటు తుపాకీ గుండ్లు కలిగివున్న దావూద్ ఇబ్రహీం మాజీ అనుచరుడు రౌడీషీటర్ సయ్యద్ ఆబిద్ హుస్సేన్ అలియాస్ అలీ డాన్ తో పాటు అతని అనుచరుడు మొహమ్మద్ అఫ్జుద్‌ను గొల్కొండ జోన్ టాస్క్‌ఫోర్స్, గుడిమల్కాపూర్ పోలీసులు సంయుక్తంగా అరెస్ట్ చేశారు.పరారీలో ఉన్న హర్యానాకు చెందిన ఆయుధ సరఫరాదారు సాహిల్ కోసం పోలీసులు గాలిస్తున్నారు. వీరి నుండి ఒక పిస్టల్, మ్యాగజైన్, 6 తుపాకీ గుండ్లు,3 ఖరీదైన మొబైల్ ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.పోలీసులు ఇచ్చిన వివరాల ప్రకారం..జహీరాబాద్ కి చెందిన సయ్యద్ ఆబిద్ హుస్సేన్ అలియాస్ అలీ డాన్ గతంలో పలు నేరాల్లో నిందితుడుగా ఉండి..1993లో దుబాయ్ వెళ్లి డికంపెనీ లో చేరిన అతడు..గల్ఫ్ దేశాల నుండి భారతదేశంలోని ప్రముఖులను టార్గెట్ చేస్తూ..ఫోన్లలో బెదిరింపులకు గురిచేసి పెద్ద ఎత్తున వసూళ్లకు పాల్పడ్డాడు. అనంతరం హైదరాబాద్ పూణే జైళ్లలో 14 ఏళ్ళు శిక్ష అనుభవించాడు. బయటకు వచ్చిన తర్వాత రియల్ ఎస్టేట్ వ్యాపారం ప్రారంభించి మళ్లీ సెటిల్మెంట్లు, బెదిరింపులకు పాల్పడటం మొదలుపెట్టాడు.2024లో ఓ కేసులో కంది జైలులో ఉన్న సమయంలో మత్తుపదార్థాల కేసులో ఉన్న సాహిల్‌తో అలీ డాన్‌కు పరిచయం ఏర్పడింది. బెయిల్‌పై బయటకు వచ్చాక సాహిల్ జహీరాబాద్ వచ్చి రూ.45,000లకు ఒక పిస్టల్,6 గుండ్లను అలీ డాన్‌కు విక్రయించాడు.ఈ ఆయుధంతో స్థానికులను బెదిరించి అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న అలీ డాన్ గురించి విశ్వాసనీయ సమాచారం అందుకున్న గుడిమల్కాపూర్ పోలీసులు స్టేషన్ పరిధిలో సంచరిస్తున్న నిందితులను టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకుని పలు చట్టాల కింద కేసు నమోదు చేశారు.అలీ డాన్‌పై గతంలో జూబ్లీహిల్స్, నాంపల్లి,మలక్‌పేట్, ఎస్‌ఆర్ నగర్ సహా వివిధ పోలీస్ స్టేషన్లలో 15కు పైగా కేసులు నమోదైనట్లు పోలీసులు తెలియజేశారు.ఈ ఆపరేషన్‌ను టాస్క్‌ఫోర్స్ అదనపు డీసీపీ అండే శ్రీనివాసరావు పర్యవేక్షణలో గొల్కొండ జోన్ ఇన్‌స్పెక్టర్ ఎం.మహేష్,ఎస్సై వి.శ్రీనివాస్ గుడిమల్కాపూర్ పోలీసు బృందం విజయవంతంగా పూర్తి చేశారు.



# బండరావిరాలలో విగ్రహ వివాదం

- కుల వివక్ష చూపిస్తే రాష్ట్రస్థాయి ఉద్యమం
- నాయి బ్రాహ్మణ సంఘం హెచ్చరిక

**అబ్దుల్లాపూర్‌మెట్,తెలంగాణ చౌరస్తా:** బండరావిరాలలో గుండోజి రంగదాసు పంతులు విగ్రహ ఏర్పాటుకు కులపరమైన కారణాలతో అడ్డంకులు సృష్టించడాన్ని నాయి బ్రాహ్మణ సంఘం రాష్ట్ర అధ్యక్షులు రాచమళ్ళ బాలకృష్ణ తీవ్రంగా ఖండించారు.గ్రామానికి చెందిన కొత్త ప్రభాకర్ గౌడ్,బంగారి నర్సింగరావు,కూనోజు బిక్షపతి కుల వివక్ష చూపుతూ వృత్తిని కించపరుస్తూ రాజకీయం చేస్తున్నారని ఆయన ఆరోపించారు.కుల వివక్షతో అడ్డంకులు సృష్టిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్ స్టేషన్ సీఐకి నాయకులు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. విగ్రహ ఏర్పాటు జరిగే వరకు పోరాటం కొనసాగుతుందని.. అవసరమైతే రాష్ట్ర స్థాయిలో ఉద్యమిస్తామని బాలకృష్ణ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో నాయి బ్రాహ్మణ సంఘం రాష్ట్ర నాయకులు పెంబర్తి శ్రీనివాస్,ఆర్. జయసింహ,చెన్నారం మల్లేశం తదితరులు పాల్గొన్నారు.



# కాంగ్రెస్ నూతన మండల,డివిజన్ అధ్యక్షులకు నియామకపత్రాలు

- ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి చేతుల మీదుగా నియామకపత్రాల అందజేత

**అబ్దుల్లాపూర్ మెట్,తెలంగాణ చౌరస్తా:** కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ప్రతిఒక్కరూ ఐక్యంగా కృషి చేయాలని నాయకులు నిరంతరం కార్యకర్తలకు అందుబాటులో ఉండాలని ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం సాయంత్రం తొర్రూర్‌లోని తన క్యాంపు కార్యాలయంలో రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ కమిటీ డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డితో కలిసి నియోజకవర్గ పరిధిలోని నూతన మండల,డివిజన్ పార్టీ అధ్యక్షులకు నియామకపత్రాలు అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ.. పార్టీ పదవులను బాధ్యతగా స్వీకరించి ప్రజలకు పార్టీకి సేవలందించాలని సూచించారు.గ్రామస్థాయి నుంచి పార్టీని మరింత బలోపేతం చేయాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలు,అభివృద్ధి కార్యక్రమాలను ప్రజా క్షేత్రంలోకి విస్తృతంగా తీసుకెళ్లాలని కోరారు. అలాగే ప్రతిపక్షాలు చేసే అసత్య ఆరోపణలను ఎక్కడికక్కడ తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం నియోజకవర్గానికి చెందిన మంచాల,యాచారం, ఇబ్రహీంపట్నం, అబ్దుల్లాపూర్‌మెట్ మండలాలు, ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీతో పాటు ఆదిభట్ల,తొర్రూర్, తుర్కయంజాల్, కొంగర, కుంట్లూర్, పెద్దఅంబర్‌పేట్ డివిజన్లకు ఎంపికైన నూతన అధ్యక్షులు నియామకపత్రాలు అందుకున్నారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ ఛైర్మన్లు చిలుక మధుసూధన్‌రెడ్డి, గురునాథ్ రెడ్డి,పార్టీ నాయకులు పాండురంగారెడ్డి, కొత్తపల్లి జైపాల్ రెడ్డి ,భూపతిగల్ల మహిపాల్, భాస్కరాచారి,ఈసీ శేఖర్‌గౌడ్,భీమగౌని భాస్కర్ గౌడ్,పండుగల రాజు,రాచర్ల వెంకటేశ్వర్లు,కొత్తకుర్మ శివకుమార్,ధనరాజ్ గౌడ్,దాసు,జడల రవీందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ప్రగతి నగర్‌లో ఘోర ప్రమాదం

- లిఫ్ట్ గ్యాప్‌లో పడి పెయింటర్ మృతి



**హయత్ నగర్,తెలంగాణ చౌరస్తా:** నిర్మానదశ లో ఉన్న భవనానికి పెయింటింగ్ పనులు చేస్తుండగా ప్రమాదవశాత్తు లిఫ్ట్ గ్యాప్‌లో పడి ఓ పెయింటర్ అక్కడికక్కడే మృతి చెందిన ఘటన హయత్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్రగతి నగర్‌లో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..చింతలపూడి వెంకటేశ్వరరావు (55) గత 30 ఏళ్లుగా పెయింటింగ్ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు.మంగళవారం ఉదయం 10:30 గంటల ప్రాంతంలో ఆయన తన కుమారుడితో కలిసి ప్రగతి నగర్‌లోని రాజధాని బ్యాంక్ వద్ద ఉన్న ఒక పెంట్‌హౌస్‌లో పెయింటింగ్ పనులకు వెళ్లాడు. పనులు చేస్తుండగా ప్రమాదవశాత్తు కాలుజారి లిఫ్ట్ నిర్మాణం కోసం వదిలిన ఖాళీ ప్రదేశం గుండా పై అంతస్తు నుండి కిందపడిపోయాడు. గమనించిన కుమారుడు వెంటనే అంబులెన్స్‌కు సమాచారం అందించినప్పటికీ తీవ్ర గాయాల పాలైన వెంకటేశ్వరరావు అప్పటికే మృతి చెందాడు. భవన నిర్మాణ సమయంలో బిల్డర్ తగిన భద్రతా చర్యలు తీసుకోకపోవడం, లిఫ్ట్ గ్యాప్‌ను సురక్షితంగా మూసివేయకపోవడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని మృతుడి కుమారుడు ఆరోపించారు.బిల్డర్ మల్లెల సుబ్బారావుపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేశారు.బాధితుడి ఫిర్యాదు మేరకు హయత్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని ఘటనాస్థలాన్ని పరిశీలించారు.ఎస్‌హెచ్‌ఓ సి.హెచ్.శంకరయ్య,సబ్ ఇన్స్పెక్టర్ కె.అరుణ్ ల పర్యవేక్షణలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



# కుంట్లూరులో వైభవంగా గణనాథుని ఉత్సవాలు

**అబ్దుల్లాపూర్ మెట్,తెలంగాణ చౌరస్తా:** కుంట్లూరు డివిజన్ పరిధిలోని ఎం.కె.ఆర్ నగర్‌లో శ్రీ గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో గణపతి నవరాత్రి ఉత్సవములు మంగళవారం అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. ప్రతి ఏటా జరిగే గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా విగ్రహ దాత మద్ది శ్రీనివాస్ యాదవ్ సౌజన్యంతో ఐదవ సంవత్సరం ఏర్పాటు చేసిన గణేశుడికి కాలనీవాసులు ,భక్తులు విశేష సంఖ్యలో హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా విగ్రహ దాత మద్ది శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ..కాలనీవాసులంతా ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని,ఆ గణపయ్య ఆశీస్సులు ఎల్లప్పుడూ అందరిపై ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాద వితరణ చేపట్టారు.ఈ కార్యక్రమంలో మద్ది సునీత యాదవ్, మనీష్ యాదవ్,మిఖిలేష్ యాదవ్,ఉత్సవ కమిటీ ప్రతినిధులు కాలనీ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.




# గణేష్ మండపాల వద్ద డ్రగ్స్‌పై అవగాహన

- ప్రశాంత వాతావరణంలో ఉత్సవాలు జరుపుకోవాలి
- ప్రజలకు పోలీసుల పిలుపు

**అబ్దుల్లాపూర్ మెట్,తెలంగాణ చౌరస్తా:** గణేష్ ఉత్సవాలను పురస్కరించుకుని గణేష్ మండపాల వద్ద భక్తులకు, యువతకు డ్రగ్స్ పై అవగాహన కల్పించడంతో పాటు,ఉత్సవాలు ప్రశాంతంగా జరిగేలా హయత్ నగర్ పోలీసులు చర్యలు చేపట్టారు.రాచకొండ పోలీస్ కమిషనర్ బి.సుమతి ఆదేశాల మేరకు హయత్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం ఈగల్ టీమ్ సహచర సిబ్బందితో కలిసి ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు.హయత్‌నగర్ సీఐ సిహెచ్.శంకరయ్య,ఈగల్ టీమ్ ఇన్‌స్పెక్టర్ శ్రీ రాము, ఎస్సైలు డి.కృష్ణయ్య,కె. అరుణ్ కుమార్ పోలీస్ సిబ్బంది పెద్ద అంబర్‌పేట్, కుంట్లూరు గ్రామం శివాలయం రోడ్ ప్రాంతాల్లోని పలు గణేష్ మండపాలను సందర్శించారు.ఈ సందర్భంగా అధికారులు మాట్లాడూతూ...మత్తు పదార్థాల వల్ల కలిగే ఆరోగ్య, మానసిక, సామాజిక నష్టాలను వివరించారు. ముఖ్యంగా యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని స్పష్టం చేశారు.డ్రగ్స్ విక్రయాలు లేదా వినియోగానికి సంబంధించిన సమాచారం తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. మండపాల వద్ద విద్యుత్ భద్రత, అగ్ని ప్రమాదాల నివారణ చర్యలు తీసుకోవాలని సూచించారు. భక్తుల నియంత్రణ, వాహనాల పార్కింగ్ క్రమబద్ధీకరణపై నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. గణేష్ పూజలు నిమజ్జన కార్యక్రమాలలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంత వాతావరణంలో పూర్తికావడానికి మండపాల నిర్వాహకులు పోలీసులకు పూర్తిస్థాయిలో సహకరించాలని విజ్ఞప్తి చేశారు.



# మహేశ్ కుమార్ గౌడ్ నాయకత్వంలో టీపీసీసీ మరింత బలోపేతం

- జక్కిడి శివచరణ్ రెడ్డి

**ఎల్ బినగర్,తెలంగాణ చౌరస్తా:** టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ పదవీ బాధ్యతలు స్వీకరించి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో మంగళవారం గాంధీభవన్‌లో వేడుకలు ఘనంగా జరిగాయి.ఈ కార్యక్రమానికి విచ్చేసిన మహేశ్ కుమార్ గౌడ్‌కు యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు జక్కిడి శివచరణ్ రెడ్డి నేతృత్వంలో పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా శివచరణ్ రెడ్డి మాట్లాడుతూ..మహేశ్ కుమార్ గౌడ్ సారథ్యంలో టీపీసీసీ బలమైన శక్తిగా రూపుదిద్దుకుందని అన్నారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతమై, రానున్న రోజుల్లో రాష్ట్రంలో మరోసారి అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

# 25 కిలోల వినాయకుడికి 108 బంగారు పుష్పాలతో పూజలు

**తెలంగాణ చౌరస్తా, స్టేట్ బ్యూరో :** ఎత్తైన విగ్రహాలను కొనుగోలు చేస్తూ నవరాత్రులు నిర్వహిస్తున్న మండపాలను చూస్తుంటాం. కానీ ఇక్కడ మాత్రం పర్యావరణ హితం కోసం మట్టి వినాయకుని పూజిస్తున్నారు. దీంతో పాటు 25 కిలోల వెండితో తయారు చేసిన వినాయకుని నిత్యాభిషేకాలు చేస్తూ భక్తి భావాన్ని చాటుతున్నారు. జగిత్యాల జిల్లా మెట్‌పల్లిలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం నిర్వహించే వినాయక చవితి వేడుకలకు ఓ ప్రత్యేకత ఉంది. పర్యావరణ పరిరక్షణలో భాగంగా మట్టి వినాయకుడిని ప్రతిష్టించి నిత్య పూజలు చేస్తుంటారు. ఇలా గత 14 సంవత్సరాల నుంచి మట్టి గణపతిని పూజిస్తూ ఇతరులకు స్ఫూర్తిగా నిలుస్తున్నారు. మట్టి వినాయకుని ప్రతిష్టించిన నిర్వాహకులు నిత్య పూజల కోసం ప్రత్యేకంగా 25 కిలోల వెండితో వినాయకుడిని తయారు చేయించారు. గణపతితోపాటు మహాలక్ష్మి, సరస్వతి దేవి, శివలింగాలు కూడా వెండితో తయారు చేయించారు. వెండి ప్రతిమలను



మేళ తాళాల మధ్య పురవీధుల గుండా ఊరేగించారు. ఈ కార్యక్రమం కనుల పండువగా సాగింది.

### బంగారు పుష్పాలతో పూజ

అభిషేకాలు చేసిన అనంతరం 108 బంగారు పుష్పాలతో స్వామివారిని పూజిస్తూ ఆర్యవైశ్యులు ప్రత్యేకతను చాటుకుంటున్నారు. ప్రతి ఏట తొమ్మిది రోజుల పాటు ఉదయం నుంచి రాత్రి వరకు వివిధ పూజలు అభిషేకాలు, భజనలు సాంస్కృతిక కార్యక్రమాలు అక్కడి వాతావరణ ఆధ్యాత్మికంగా మార్చేస్తాయి.









# ఆర్టీసీ బస్సును ఢీకొట్టిన టిప్పర్

- 20 మంది ప్రయాణికులకు తీవ్ర గాయాలు

**ఎల్ బినగర్,తెలంగాణ చౌరస్తా:** నాగోల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కుంట్లూరు రాజీవ్ గృహకల్ప వద్ద మంగళవారం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఆర్టీసీ బస్సును వేగంగా వచ్చిన టిప్పర్ లారీ బలంగా ఢీకొట్టడంతో 20 మందికి పైగా ప్రయాణికులు తీవ్రంగా గాయపడ్డారు.స్థానికుల వివరాల ప్రకారం.. హయత్‌నగర్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు రాజీవ్ గృహకల్ప వద్ద ప్రయాణికులను ఎక్కించుకుని మెయిన్ రోడ్డు దాటుతుండగా నాగోల్ వైపు నుంచి అతివేగంగా వచ్చిన టిప్పర్ లారీ బస్సును తీవ్రంగా ఢీకొట్టింది.ఈ ఘటనతో బస్సులోని ప్రయాణికులు భయాందోళనకు గురయ్యారు. ప్రమాద తీవ్రతకు పలువురికి తీవ్ర రక్తస్రావమైంది.ప్రమాదాన్ని గమనించిన స్థానికులు వెంటనే స్పందించి సహాయక చర్యలు చేపట్టారు.108 సిబ్బంది క్షతగాత్రులను వనస్థలిపురం ఏరియా ఆస్పత్రి,సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రులకు తరలించారు.సమాచారం అందుకున్న నాగోల్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు.అతివేగమే ఈ ప్రమాదానికి కారణమని ప్రాథమికంగా పంచనా కి వచ్చారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు.



# విద్యార్థులకు బంగారు భవిష్యత్తు

- ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు పౌష్టికంగా ఉండాలి
- రేవంత్ రెడ్డి ప్రభుత్వంలో మెరుగైన విద్యావ్యవస్థ
- నియోజకవర్గంలో రూ. 200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ పాఠశాల..
- ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు

**కాల్వ శ్రీరాంపూర్, తెలంగాణ చౌరస్తా:**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అల్పాహార కార్యక్రమాన్ని హరే రామ కృష్ణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఆలోచన మేరకు పెద్దపల్లి నియోజకవర్గంలోని కాల్వశ్రీరాంపూర్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు తెలంగాణ అల్పాహర కార్యక్రమాన్ని ప్రారంభించి విద్యార్థులతో కలిసి అల్పాహారం చేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ...ప్రభుత్వ పాఠశాలలకు విద్యార్థులు ఉదయ 9:00 గంటలకే హాజరవుతారని పిల్లల తల్లి తండ్రులు గ్రామీణ ప్రాంతంలో వ్యవసాయ,ఇతర పనుల నిమిత్తం ఉదయం 8 గంటలలోపే పనులకు వెళ్లిపోవడం జరుగుతుందని కాబట్టి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టిలో ఉంచుకొని పిల్లల బంగారు భవిష్యత్తు కోసం వారు పౌష్టికంగా ఉండాలని నాణ్యమైన విద్యను అభ్యసించాలని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అల్పాహారం పాలు పంపిణి కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి ప్రతిష్టాత్మకంగా చేపట్టడం జరిగిందని తెలిపారు.వారానికి 6 రోజులు పిల్లలకు అల్పాహారం ఇడ్లీ సాంబార్,పూరీ ఆలుకుర్మ, దోస,ఉక్మా,మిల్లెట్ ఇడ్లీ సాంబార్,బోండా 6 రకాల టిఫిన్స్ను అందించడం జరుగుతుందని మన పిల్లలు బాగా చదువుకోవాలని విద్యావంతులు కావాలని మన ప్రాంతానికి గ్రామానికి మంచి పేరు తేవాలని ముఖ్యమంత్రి, కాంగ్రెస్ ప్రభుత్వం ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం జరిగిందని తెలిపారు.పెద్దపల్లి నియోజకవర్గంలోనే 65 కోట్ల రూపాయలతో పలు ప్రభుత్వ పాఠశాలల్లో కాంపౌండ్ వాల్స్, కొత్త పాఠశాల భవన నిర్మాణాలు,టాయిలెట్స్,పాఠశాల బిల్డింగ్ ఆధునీకరణ పలు అభివృద్ధి పనులను పూర్తి చేసుకోవడం జరిగిందని గుర్తు చేశారు.శ్రీరాంపూర్ మండల కేంద్రంలో ప్రభుత్వ పాఠశాలను ఆరోజు నేను శాసనసభ్యుడిగా ఉన్నప్పుడు నిర్మాణం చేస్తే మోడల్,కస్తూర్బా పాఠశాలకు దాదాపు రెండున్నర కోట్ల రూపాయలతోని సాంక్షన్ తీసుకొని దాదాపు 30 లక్షలతోని కాంపౌండ్ వాల్ ఇతర పనులను ప్రారంభించుకున్నామని అన్నారు.పెద్దపల్లి నియోజకవర్గంలో 200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ పాఠశాల నిర్మాణం కోసం పనులు ప్రారంభించుకోవడం జరిగిందన్నారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలంగాణ అల్పాహర కార్యక్రమాన్ని ప్రవేశపెట్టడం సంతోషకరమని వారికి పెద్దపల్లి నియోజకవర్గ ప్రజల తరుపున ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ గోపగోని సారయ్య గౌడ్,తాసిల్దార్ రాపెల్లి రాముడు, ఎంపీడీవో సురేందర్ కుమార్, మండల విద్యాధికారి సిరిమల్ల మహేష్,సర్పంచ్ బంగారి రమేష్,వ్యవసాయ మార్కెట్ చైర్మన్ రామిడి తిరుపతి రెడ్డి,వైస్ చైర్మన్ సబ్బని రాజమల్లు,మాజీ జడ్పీటీసీ లంక సదయ్య, మండల పార్టీ అధ్యక్షుడు గజనవేణ సదయ్య,పలు గ్రామాల సర్పంచ్ లు, ఉపసర్పంచ్ లు,పలువురు ప్రజాప్రతినిధులు,కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు,యూత్ కాంగ్రెస్ నాయకులు ఉపాధ్యాయులు,విద్యార్థులు, గ్రామస్తులు,తదితరులు, పాల్గొన్నారు.









# హమాలీ కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

- సంక్షేమ బోర్డుకు సమగ్ర చట్టం చేయాలి.
- ప్రొఫెసర్ కొండా నాగేశ్వర్ రావు
- 50 ఏళ్ళు దాటిన హమాలి కార్మికులకు 10వేల పెన్షన్ ఇవ్వాలి
- ఐ.ఎఫ్.టి.యు జాతీయ ఉపాధ్యక్షులు బి ప్రదీప్

**తెలంగాణ చౌరస్తా, హైదరాబాద్:**

ఐ.ఎఫ్.టి.యు అనుబంధ తెలంగాణ హమాలీ అండ్ మిల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సుందరి విజ్ఞాన కేంద్రంలో రాష్ట్ర సదస్సు నిర్వహించారు. ఈ సదస్సును ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ కొండా నాగేశ్వర్ రావు ప్రారంభించి మాట్లాడుతూ వ్యవసాయ మార్కెట్లు, గోదాములు, రైస్ మిల్లులు, సిమెంటు, ఎరువుల గోదాములు, ప్రైవేట్ కంపెనీలలో లక్షలాది మంది హమాలీ కార్మికులు పనిచేస్తున్నారని వీరికి ఎలాంటి చట్టబద్ధమైన రక్షణ లేకుండా, జీవిత భద్రత లేకుండా జీవిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతాంగ ఉత్పత్తులు సీజన్లో వచ్చినప్పుడు స్థానిక కార్మికులకు పని ఇవ్వకుండా వలస కార్మికులను తీసుకొచ్చి స్థానిక కార్మికుల ఉపాధి దెబ్బతీస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే హమాలి వర్కర్స్ కు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చి నేటికీ ఏర్పాటు చేయకపోవడం సరికాదని అన్నారు. తక్షణమే సంక్షేమ బోర్డును ఏర్పాటు చేసి సమగ్ర చట్టం చేయాలని డిమాండ్ చేశారు. ఐ.ఎఫ్.టి.యు జాతీయ ఉపాధ్యక్షులు బి ప్రదీప్ మాట్లాడుతూ 50 సంవత్సరాలు నిండిన ప్రతి హమాలి కార్మికులకు 10వేల పెన్షన్ ఇవ్వాలని, ఈపీఎఫ్ ఈఎస్ఐ, గ్రూప్ ఇన్సూరెన్స్, ప్రమాద బీమా తప్పనిసరిగా అమలు చేయాలని అన్నారు. సంక్షేమ బోర్డు ద్వారా ఆరోగ్య భీమా, పిల్లలకు విద్యా సహాయం, ప్రసూతి ప్రయోజనాలు, వివాహ సహాయం, గృహ నిర్మాణ సహాయం సహజ మరణం ప్రమాద మరణ పరిహారం అంత్యక్రియలకు సహాయం అందించాలని కోరారు. కాంట్రాక్టర్లు ఏజెన్సీల పేరుతో జరుగుతున్న శ్రమదోపిడిని అరికట్టడానికి చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. వ్యవసాయ మార్కెట్లో పనిచేసే ప్రతి హమాలీ కార్మికుడికి ప్రతి సంవత్సరం పదివేల బోనస్ ఇవ్వాలని అన్నారు. పని సమయంలో జరిగే ప్రమాదాలకు పూర్తి నష్టపరిహారం కుటుంబ సభ్యులకు ఉద్యోగ లేదా జీవన భృతి కల్పించాలని అన్నారు. మహిళా అమాలి కార్మికులకు ప్రత్యేక రక్షణ ప్రసూతి సెలవులు సంక్షేమ పథకాలు అమలు చేయాలన్నారు. హమాలీ కార్మికులకు గుర్తింపు కార్డులు జారీ చేసి ప్రభుత్వ సంక్షేమ పథకాల అందించాలని డిమాండ్ చేశారు. కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం కార్పొరేట్ కంపెనీలకు లక్షల కోట్ల రూపాయలను రుణమాఫీ చేస్తూ కార్మికులపై పన్నుల భారాన్ని విధిస్తున్నారన్నారు. దీంతో కార్మికుల జీవన ప్రమాణాలు తగ్గుతున్నాయన్నారు. నాలుగు లేబర్ కోడ్స్ తో కార్మిక హక్కులను కాలరాస్తున్నారని మండిపడ్డారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం కార్మికులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో IFTU రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం శ్రీనివాస్ తో పాటు హమాలీ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు కే.సారంగపాణి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్. శ్రీధర్,బండి కుమార్, వెంకట నారాయణ, మోహన్, శ్రీశైలం, కోటేష్, రాము, నరసింహ, తదితరులు పాల్గొన్నారు.



# ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

- బ్రేక్ ఫాస్ట్ ప్రారంభించిన చైర్ పర్సన్ స్వరూప

**కాల్వ శ్రీరాంపూర్,తెలంగాణ చౌరస్తా:**

ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన నాణ్యమైన విద్యను అందిస్తున్నారని, తల్లిదండ్రులు తమ పిల్లల్ని ప్రభుత్వ పాఠశాలల్లోనే చదివించాలని ఊషన్నపల్లి ఆంగ్ల మాధ్యమ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల చైర్పర్సన్ పెండ్లి స్వరూప అన్నారు. పాఠశాలలోని బాల బాలికల కోసం బ్రేక్ ఫాస్ట్ కార్యక్రమాన్ని ప్రధానోపాధ్యాయుడు ఈర్ల సమ్మయ్యతో కలిసి ప్రారంభించారు.పిల్లలకు ఉదయాన్నే ప్రభుత్వం ఉచితంగా సరపరా చేసిన ఇడ్లీ,సాంబారు,పాలు అందజేశారు.ఈ సందర్భంగా స్వరూప మాట్లాడుతూ....ప్రభుత్వ పాఠశాలల్లో సకల సౌకర్యాలు కల్పిస్తున్నారని, చదువులో పిల్లల్ని అద్భుతంగా తయారు చేస్తున్నారన్నారు.తల్లిదండ్రులు తమ పిల్లల్ని ఊషన్నపల్లి ప్రభుత్వ పాఠశాలలోనే చదివించాలని ఆమె కోరారు.అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఈర్ల సమ్మయ్య మాట్లాడుతూ పిల్లల్లో పౌష్టికాహార లోపాన్ని నివారించేందుకు బ్రేక్ఫాస్ట్, మధ్యాహ్న భోజనం పథకాన్ని అమలు చేస్తోందని,ఇవి పిల్లలకు చాలా ఉపయోగకరంగా ఉంటుందన్నారు. దీనివల్ల పిల్లల్లో శారీరక, మానసిక ఎదుగుదల అధికమవుతుందని,తద్వారా వారు చాలా బాగా చదవగలుగుతారని,జ్ఞాపక శక్తి పెరుగుతుందన్నారు. అన్ని సౌకర్యాలతో ఊషన్నపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలను కార్పొరేట్ స్థాయిలో అద్భుతంగా తయారుచేస్తున్నామని,తల్లిదండ్రులు తమ పిల్లల్ని ఊషన్నపల్లి ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించాలని కోరారు.పాఠశాల చైర్పర్సన్ పెండ్లి సరూప,ప్రధానోపాధ్యాయుడు ఈర్ల సమ్మయ్య,ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు అమృత సురేష్ కుమార్,మంద శ్రీవాణి,ఎడ్ల స్రవంతి, బండారి సరిత,బండారి శంకర్,ధరణి మణికంఠ చారి,తల్లిదండ్రులు,పిల్లలు, పలువురు పాల్గొన్నారు.

# అల్పాహార కార్యక్రమం ప్రారంభం

**కాల్వ శ్రీరాంపూర్,తెలంగాణ చౌరస్తా:**



రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన తెలంగాణ అల్పాహార కార్యక్రమాన్ని తారుపల్లి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో ప్రారంభించారు.ఈ సందర్భంగా విద్యార్థులకు ఇడ్లీ, సాంబార్తో పాటు పాలు అందించారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ గాజనవేన స్వరూప సదయ్య,ఉపసర్పంచ్ అమిదాల స్వామి, పాల్గొని విద్యార్థులకు అల్పాహారాన్ని అందించారు .ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు ఆరోగ్యకరమైన,పౌష్టికాహారం అందించడం ఎంతో ముఖ్యమని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమం విద్యార్థుల ఆరోగ్యానికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రమేష్, రాజేందర్,ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, హత్య ప్రకాష్,స్కూల్ చైర్మన్తో పాటు ఉపాధ్యాయులు ,విద్యార్థులు పాల్గొన్నారు.

# పాఠశాలలో అల్పాహారం ప్రారంభం

**కాల్వ శ్రీరాంపూర్, తెలంగాణ చౌరస్తా:**



కాల్వ శ్రీరాంపూర్ మండలంలోని మీర్జంపేట గ్రామంలోని జిల్లా పరిషత్ పాఠశాల,మండల పరిషత్ పాఠశాల,విద్యార్థులకు తెలంగాణ ప్రభుత్వం సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో అల్పాహారం(బ్రేక్ ఫస్ట్) కార్యక్రమంని సర్పంచ్ పోశాల శైలజసదానందం గౌడ్ చేతుల మీదగా ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి వేముల ప్రవీణ్ కుమార్, ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కరుణాకర్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ చల్ల మానససతీష్, వార్డు సభ్యులు ఉయ్యాల చంద్రం గౌడ్,గొర్రె సుమలతహృదయ్ కుమార్, గ్రామస్తులు జిన్నా నర్సింహారెడ్డి, బొడ్డుపల్లి మల్లేష్,తదితరులు, పాల్గొన్నారు.

# సెలబ్రిటీలు...సమాజంపై వారి ప్రభావం

సెలబ్రిటీలకు ఎందరో అభిమానులు ఉంటారు. సినిమా, క్రీడలు, కళలు, రాజకీయాలు, సామాజిక సేవ వంటి వివిధ రంగాల్లో గుర్తింపు పొందిన వ్యక్తులకు సమాజంలో ప్రత్యేక స్థానం ఉంటుంది. వారు మాట్లాడే మాటలకు, చేసే పనులకు, తీసుకునే నిర్ణయాలకు సాధారణ వ్యక్తులతో పోలిస్తే ఎక్కువ ప్రాధాన్యత లభిస్తుంది. ఒక సాధారణ వ్యక్తి చెప్పిన మాట కొద్దిమందికి మాత్రమే చేరవచ్చు. కానీ ఒక ప్రముఖ వ్యక్తి చెప్పిన మాట క్షణాల్లో వేలాది, లక్షలాది మందికి చేరుతుంది. ముఖ్యంగా సామాజిక మాధ్యమాల విస్తరణతో సెలబ్రిటీల ప్రభావం మరింత పెరిగింది. ఒక చిన్న వీడియో, ఒక ఫోటో, ఒక సందేశం లేదా ఒక వ్యాఖ్య కొద్ది నిమిషాల్లోనే విస్తృతంగా ప్రజల్లోకి వెళ్లే పరిస్థితి ఏర్పడింది. అందుకే సెలబ్రిటీగా ఉండటం అంటే కేవలం పేరు, డబ్బు, గుర్తింపు, అభిమానులు కలిగి ఉండటం మాత్రమే కాదు, అది ఒక సామాజిక బాధ్యత కూడా. ప్రముఖులు మాట్లాడే ప్రతి మాటను అభిమానులు శ్రద్ధగా వింటారు. కొందరు వారు చెప్పిన విషయాలను తమ జీవితంలో ఆదర్శంగా తీసుకుంటారు. అందువల్ల ప్రజల ముందు మాట్లాడేటప్పుడు సెలబ్రిటీలు మరింత ఆలోచించి మాట్లాడాల్సిన అవసరం ఉంది. ఒక మంచి మాట నిరాశలో ఉన్న వ్యక్తికి ధైర్యాన్ని ఇవ్వగలదు. ఒక మంచి సందేశం యువతను సరైన మార్గంలో నడిపించగలదు. ఒక బాధ్యతాయుతమైన పిలుపు సమాజంలో ఒక మంచి ఉద్యమానికి




నాంది కావచ్చు. విద్య, పర్యావరణ పరిరక్షణ, రక్తదానం, అవయవదానం, రోడ్డు భద్రత, బాలల విద్య, మహిళల భద్రత, మానవతా విలువలు, మాదకద్రవ్యాల వ్యతిరేకత వంటి అంశాలపై ప్రముఖులు అవగాహన కల్పిస్తే, వారి సందేశం చాలా పెద్ద సంఖ్యలో ప్రజలకు చేరుతుంది. అదే సమయంలో బాధ్యత లేకుండా మాట్లాడిన ఒక మాట అనవసరమైన అపార్థాలకు, వివాదాలకు, కొన్నిసార్లు సామాజిక విభేదాలకు కూడా కారణం కావచ్చు. కాబట్టి ప్రముఖుల మాటల్లో ఆలోచన, సంయమనం, బాధ్యత, సామాజిక స్పృహ ఉండాలి. సెలబ్రిటీల మాటలనే కాదు, వారి జీవనశైలిని కూడా అభిమానులు గమనిస్తారు. వారు ఇతరులతో ఎలా మాట్లాడుతున్నారు? పెద్దలను ఎలా గౌరవిస్తున్నారు? సిబ్బందితో ఎలా వ్యవహరిస్తున్నారు? కష్టపడి పనిచేస్తున్నారా? విజయాన్ని ఎలా స్వీకరిస్తున్నారు? వైఫల్యాన్ని ఎలా ఎదుర్కొంటున్నారు? సమాజం పట్ల వారికి ఎంత బాధ్యత ఉంది? ఇవన్నీ అందరూ గమనిస్తుంటారు. ప్రముఖ వ్యక్తి తన విజయాన్ని మాత్రమే ప్రదర్శించడం కంటే, ఆ విజయానికి దారితీసిన కష్టాలను, ఎదుర్కొన్న వైఫల్యాలను, పట్టుదలను, క్రమశిక్షణను యువతతో పంచుకుంటే అది మరింత గొప్ప స్ఫూర్తిగా మారుతుంది. విజయం సాధించడం గొప్ప విషయం, కానీ ఆ విజయంతో మరొకరికి మార్గం చూపించడం ఇంకా గొప్ప విషయం. సెలబ్రిటీలకు ఉన్న గుర్తింపు ఒక శక్తి. ఆ శక్తిని కేవలం వ్యక్తిగత ప్రచారానికి ఉపయోగించుకోవచ్చు. కానీ అదే శక్తిని సామాజిక ప్రయోజనానికి ఉపయోగిస్తే దాని విలువ మరింత పెరుగుతుంది. ఒక ప్రముఖుడు చెట్టు నాటితే, అతని అభిమానుల్లో వందమంది చెట్లు నాటాలని ఆలోచించవచ్చు. ఒకరు పేద విద్యార్థి చదువుకు సహాయం చేస్తే, మరొకరు కూడా ఒక విద్యార్థి బాధ్యత తీసుకోవచ్చు. ఒకరు రక్తదానంపై అవగాహన కల్పిస్తే, ఎంతోమంది రక్తదానం చేయడానికి ముందుకు రావచ్చు. ఒకరు రోడ్డు భద్రతపై సందేశం ఇస్తే, ఒక కుటుంబాన్ని ప్రమాదం నుంచి కాపాడే అవకాశం ఉంటుంది. అందుకే సెలబ్రిటీ తన ప్రజాదరణను ప్రచారానికి మాత్రమే కాకుండా ప్రేరణకు కూడా ఉపయోగించాలి. అయితే ప్రభావం చూపే బాధ్యత సెలబ్రిటీలదే కాదు. అభిమానులకూ అంతే బాధ్యత ఉంది. ఎవరైనా ప్రముఖ వ్యక్తి చెప్పిన ప్రతి మాట సరైనదే అని భావించడం మంచిది కాదు. మంచి విషయాలను స్వీకరించాలి. సందేహాస్పదమైన విషయాలను ఆలోచించాలి. తప్పు అనిపించిన విషయాన్ని ప్రశ్నించే ధైర్యం కూడా ఉండాలి. వ్యక్తిని అభిమానించడం వేరు, అతను చేసే ప్రతి పనిని ఆలోచించకుండా అనుసరించడం వేరు. అభిమానం ఉండాలి. కానీ అభిమానం కంటే ఆలోచనకు ఎక్కువ స్థానం ఉండాలి. ఒక సెలబ్రిటీ మీకు స్ఫూర్తి కావచ్చు. కానీ మీ జీవితానికి సంబంధించిన ప్రతి నిర్ణయాన్ని అతని జీవితాన్ని చూసి తీసుకోవాల్సిన అవసరం లేదు. మీ పరిస్థితులు, మీ విలువలు, మీ ఆలోచనలు కూడా ముఖ్యమే. ప్రతి సెలబ్రిటీ తమ మాటలకు, తమ ప్రవర్తనకు, తమ ప్రజాదరణకు ఉన్న ప్రభావాన్ని వారు గుర్తించాలి. ఎందుకంటే సెలబ్రిటీ లభించిన గుర్తింపు కేవలం వ్యక్తిగత సంపద కాదు. అది ప్రజల ప్రేమతో ఏర్పడిన ఒక సామాజిక మూలధనం. ఆ మూలధనాన్ని సమాజానికి తిరిగి అందించగలిగితేనే ఆ ప్రజాదరణకు నిజమైన అర్థం ఉంటుంది. ప్రజలను తప్పుదోవ పట్టించే మాటల కంటే, మంచి ఆలోచనలను పెంచే మాటలు అవసరం. విభేదాలను పెంచే వ్యాఖ్యల కంటే, సమాజాన్ని కలిపే సందేశాలు అవసరం. వ్యక్తిగత ప్రచారం కంటే, సామాజిక ప్రయోజనానికి ఉపయోగపడే కార్యక్రమాలు అవసరం. అభిమానాన్ని సంపాదించడం గొప్ప విషయం. కానీ ఆ అభిమానాన్ని మంచి మార్పు కోసం ఉపయోగించడం అంతకంటే గొప్ప విషయం. ఒక సెలబ్రిటీ వేసే ప్రతి అడుగు ఎవరికో ఒకరికి ఆదర్శం కావచ్చు. ఒక మాట ఎవరికో ఒక ఆలోచనను కలిగించవచ్చు. ఒక మంచి పని మరొకరిని సేవా మార్గంలో నడిపించవచ్చు. అందుకే సెలబ్రిటీగా ఉండటం కేవలం ఒక హోదా కాదు. అది ఒక ప్రభావం. ఆ ప్రభావం ఒక శక్తి. ఆ శక్తి ఒక బాధ్యత. ఆ బాధ్యతను సమాజం కోసం ఉపయోగించినప్పుడే ఆ ప్రజాదరణకు నిజమైన విలువ లభిస్తుంది.



వై.సంజీవ కుమార్,
ఫౌండర్ & ప్రెసిడెంట్,
స్కై ఫౌండేషన్ & స్కై ఫౌండేషన్ ట్రస్ట్,
9393613555 / 9493613555